క్లుప్తంగా

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జరిమానా

అద్దంకి రూరల్: అద్దంకి పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ఇద్దరు వ్యక్తులపై సీఐ సుబ్బరాజు కేసునమోదు చేసి శనివారం కోర్టుకు హాజరు పరిచారు. న్యాయమూర్తి బి. అఖిల ఒకరికి రూ.5 వేలు, మరొకరికి రూ. 3 వేలు జరిమాన విధించినట్లు సీఐ తెలిపారు.

ప్రజా సమస్యలు పరిష్కరించండి

చీరాల టౌన్: ప్రజలకు ఉన్న రెవెన్యూ సమస్యల పరిష్కారంలో రెవెన్యూ ఉద్యోగులు, సిబ్బంది అలసత్వం వహించకుండా నిబద్ధతతో పనిచేయాలని తహసీల్దార్ కుర్రా గోపీకృష్ణ సూచించారు. శనివారం రెవెన్యూ కార్యాలయంలోని సమావేశపు హాలులో రెవెన్యూ ఉద్యోగులతో సమావేశాన్ని నిర్వహించారు. మండలంలోని రెవెన్యూ గ్రామాల వారీగా పెండింగ్‌లో ఉన్న అర్జీలను త్వరగా విచారణలు చేసి ప్రజల సమస్యలను పరిష్కరించాలన్నారు. రెవెన్యూ ఉద్యోగులు ప్రజలతో సత్సంబంధాలు కలిగి జవాబుదారీగా పనిచేయాలన్నారు. ప్రభుత్వం అందించే రెవెన్యూ సేవలను అందరికీ అందించాలన్నారు. భూసమస్యల అర్జీల విచారణ నిష్పక్షపాతంగా చేయాలన్నారు. భూములకు సంబంధించిన రికార్డులు విధిగా ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేయాలని కోరారు. సమావేశంలో డీటీ సుశీల, ఆర్ఐ శేఖర్, సర్వేయర్ బసవాచారి, వీఆర్వోలున్నారు.

స్మార్ట్ మీటర్లతో నిలువు దోపిడీ

చీరాల అర్బన్: విద్యుత్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ, పెరిగిన విద్యుత్ చార్జీలు, ట్రూ అప్ చార్జీలు తగ్గించాలని కోరుతూ శనివారం స్థానిక సీనియర్ సిటిజన్ అసోసియేషన్ కార్యాలయంలో వామపక్షాలు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. బలహీనవర్గాల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోసాల ఆశీర్వాదం, ఏఐటీయూసీ చీరాల కార్యదర్శి బాసి పైడియ్య అధ్యక్షత వహించారు. ఏఐటియూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల శామ్యూల్ మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు బిగిస్తే వాటిని వెంటనే పగలగొట్టమని ఆనాడు ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ చెప్పిందన్నారు. అధికారం చేపట్టిన తర్వాత మరలా బిగించడం దుర్మార్గమన్నారు. గుడిసెల్లో ఉండే పేద ప్రజలు ఎక్కడో పనిచేసుకుంటారని, రీచార్జి అయితేపోతే వారికి అవగాహన లేక ఇబ్బందులు పడతారన్నారు. ఈనెల 5న జరిగే ధర్నాకు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని.. ప్రభుత్వం చేసే మోసాలను ఎండగట్టాలన్నారు.

వ్యాధులు సోకకుండా జాగ్రత్తలు తీసుకోండి



కోడూరి వారిపాలెంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

చినగంజాం: ప్రజలు వ్యాధులు సోకకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని చినగంజాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ పి. సాయిశ్రీచరణ్ అన్నారు. శనివారం మండలంలోని పెదగంజాం పంచాయతీ కోడూరి వారిపాలెం గ్రామంలో గ్రామ పెద్దలు, ప్రజలకు వ్యాధులు సోకకుండా ఉండేలా ముందస్తు జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సీజన్‌లో వర్షాలు కారణంగా డెంగీ, మలేరియా, చికున్ గున్యా, టైఫాయిడ్ వ్యాధులు రాకుండా ముందస్తుగా జాగ్రత్తలు తీసుకునేందుకు అవసరమైన చర్యలు గురించి వివరించారు. ఇంటి పరిసరాల్లో పాత టైర్లు, వాడేసిన కొబ్బరి బోండాలు, ఖాళీ బాటిల్స్, రోళ్ళు, పనికిరాని బాటిల్స్, నీళ్ళు నిలువ ఉంచిన పూల కుండీలు, నీరు నిలువ ఉండే ఫ్రిజ్‌లు, ఎయిర్ కూలర్‌లలో నీరు ఎక్కువ కాలం నిలువ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. హెల్త్ సూపర్ వైజర్ చిరంజీవి, హెల్త్ అసిస్టెంట్ మురళి, 104 డీఈఓ పాదిలి రాఘవ, ఆరోగ్య కార్యకర్తలు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌లు పాల్గొన్నారు.

వారు చేస్తే తప్పు.. మీరు చేస్తే ఒప్పు!

- రీ- సర్వే పై అప్పట్లో కూటమి నాయకుల విష ప్రచారం
- రైతుల్లో అయోమయం సృష్టించిన నాయకులు
- తాజా సర్వేకు అప్పటి విధానాలనే అనుసరిస్తున్న వైనం



రీసర్వే చేస్తున్న రెవెన్యూ సిబ్బంది(ఫైల్)

వేటపాలెం: సమగ్ర భూ సర్వేకు సంబంధించి గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరించిన మార్గమమే ఉత్తమని కూటమి ప్రభుత్వం చేపట్టిన చర్యలు చెప్పకనే చెబుతున్నాయి. ఆ నాడు వ్యతిరేకించి నేడు భూముల రీ- సర్వే చేపట్టింది. వైఎస్సార్ సీపీ హయాంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పారదర్శకంగా చేపట్టిన భూముల రీ సర్వేపై విష ప్రచారం సాగించిన టీడీపీ కూటమి నేతల నోళ్లు ఇప్పుడు మూతపడ్డాయి. దీనికి తోడు భజన పత్రికల చేతులకు బ్రేక్‌లు పడ్డాయి.

గత ప్రభుత్వంలో సర్వే ఇలా..

సర్వే క్రమంలో తలెత్తే వివాదాల పరిష్కారానికి ప్రత్యేకంగా మండలానికి ఒక డిప్యూటీ తహసీల్దార్‌ను మొబైల్ మేజిస్ట్రేట్‌గా గత ప్రభుత్వం నియమించింది. ప్రస్తుత ప్రభుత్వం కూడా ఇదే పంథాను అనుసరిస్తోంది. మండలం లో తొమ్మిది గ్రామ పంచాయతీలకు సంబంధించి 20,274.89 ఎకరాల రీ సర్వేకు గత ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకుంది. ఇందులో ప్రభుత్వ భూమి 8,101.22 ఎకరాలు ఉంది. అన్ని గ్రామాల్లో డ్రోన్ పై లైఓఆర్ఐ(ఆర్థో రెక్టిఫైడ్ ఇమేజ్) చిత్రాలను తీశారు. ఇదే క్రమంలో మండల పరిధిలోని రెండు గ్రామాల్లో 5,680 ఏకరాల సర్వే సంపూర్ణ స్థాయిలో పూర్తి చేశారు. ఈ విధానలతో సర్వే ప్రక్రియను గత ప్రభుత్వం సులభతరం చేసింది. దీంతో తాజాగా మిగిలిన గ్రామాల్లో ఎలాంటి అడ్డంకులూ లేకుండా రీ-సర్వే జరుగుతోంది. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం రీ-సర్వే పై విషప్రచారం చేసి ప్రజల్లో, రైతుల్లో ఆయోమయం సృష్టించింది. రైతుల భూములు, ప్రజలు స్థలాలు ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని తమ తోక పత్రికల ద్వారా విస్తృతంగా ప్రచారం చేయించారు. అయితే ప్రస్తుతం రీ- సర్వే మాత్రం గత ప్రభుత్వం అనుసరించిన విధానంలోనే సాగడం గమనార్హం. ఎన్నికల ముందు చేసిన విషప్రచారం సంగతి పచ్చి అబద్ధాలని ప్రజలకు తేట తెల్లమైంది.

విద్యార్థి దశ నుంచే ఆరోగ్యంపై అవగాహన అవసరం



విద్యాలయంలోని బాలికలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సిరివెన్నెల

చినగంజాం: విద్యార్థి దశ నుంచే బాలికలు తమ ఆరోగ్య విషయాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఇంకొల్లు సెక్టార్ అంగన్‌వాడీ ప్రాజెక్ట్ సీడీపీఓ సులోచనా రాణి అన్నారు. కిశోర్ బాలికల అవగాహన కార్యక్రమంలో భాగంగా స్థానిక కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో వైద్యాధికారి డాక్టర్ సిరివెన్నెల ముఖ్య అతిథిగా కార్యక్రమాన్ని నిర్వహించారు. బాలికలు విద్యార్థి దశలో విద్యపై శ్రద్ధ తీసుకోవాలని దాంతో పాటు తమ వ్యక్తిగత ఆరోగ్య విషయాలపై పూర్తి అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని ఆమె విద్యాలయంలోని బాలికలకు సూచించారు, బాల్య వివాహాలకు దూరంగా ఉండలని, బాలికలలో తరచుగా ఏర్పడే రక్తహీనత పట్ల పూర్తి జాగ్రత్త వహించాలని, మంచి ఆహారపు అలవాట్లు ఏర్పరచుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, యుక్త వయస్సులో వచ్చే సమస్యలపై పూర్తి అవగాహన కలిగి వైద్యుల సలహాల మేరకు చికిత్సలు చేయించుకోవాలని వారు సూచించారు. అంతేగాకుండా సూచనలు సలహాలు కోసం టోల్ ఫ్రీ నంబర్‌లుపై పూర్తి అవగాహన కల్పించారు. అనంతరం బాలికలతో అవగాహన ర్యాలీ ప్రదర్శన నిర్వహించారు. బాలికా విద్యాలయం ప్రిన్సిపాల్ ఎం. సుమాంజలి, ఉపాధ్యాయ సిబ్బంది, అంగన్ వాడీ కార్యకర్తలు, బాలికలు పాల్గొన్నారు.

గ్రామాల్లో కొత్త వ్యక్తులను గుర్తించండి



యర్రంవారిపాలెంలో పల్లెనిద్రలో మాట్లాడుతున్న ఎస్ఐ ఖాదర్‌బాషా

యర్రంవారిపాలెం (కారంచేడు): గ్రామాల్లో కొత్తగా వచ్చిన వ్యక్తులు అనుమానాస్పదంగా వ్యవరించినా, సంచరించినా ప్రజలు అప్రత్తంగా ఉండాలని ఎస్ఐ షేక్ ఖాదర్‌బాషా హెచ్చరించారు. శుక్రవారం రాత్రి నుంచి శనివారం వేకువజాము వరకు ఆయన మండలంలోని యర్రంవారిపాలెం గ్రామంలో పల్లె నిద్ర చేశారు. శనివారం వేకువజామున ఆయన గ్రామస్తులతో ముచ్చటించారు. రాత్రి సమయాల్లో, వేకువజాముల్లోను ఎక్కువగా దొంగతనాలు జరుగుతుంటాయన్నారు. దొంగలు ముందుగానే గ్రామాల్లో సంచరించి అన్ని పరిశీలించుకుంటారన్నారు. అలాంటి సమయంలోనే వారిని మనం గుర్తించాలన్నారు. అప్పుడే మన గ్రామాల్లో జరిగే దొంగతనాలను, అరాచకాలను త్వరగా అరికట్టవచ్చన్నారు. దేవాలయాలు, గుళ్ళు, మందిరాలను వారు టార్గెట్‌గా ఉంచుకుంటారని వివరించారు. అవసరమైన చోట కమిటీ సభ్యులు తప్పకుండా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు.

మోసం చేయడం బాబు నైజం



క్యూఆర్ కోడ్‌ను ప్రదర్శిస్తున్న నాయకులు

వేటపాలెం: ఎన్నికల సమయంలో అబద్ధపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేయడం టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు నైజమని వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు సాదు రాఘవ, మాజీ అధ్యక్షుడు బొడ్డు సుబ్బారావు పేర్కొన్నారు. మండల పరిధిలోని పుల్లరిపాలెంలో శుక్రవారం రాత్రి చీరాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ ఆదేశాల మేరకు బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రజలను సమావేశపరిచి చంద్రబాబు ఇచ్చిన హామీలు, వాటిని అమలు చేయకుండా చేస్తున్న మోసం గురించి వివరించారు. చంద్రబాబు హామీలు అమలు కాకపోవడంతో ఒక్కో కుటుంబం ఎంత మేర నష్టపోయిందో క్యూఆర్ కోడ్ స్కాన్ చేయించి చూపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలను సైతం అమలు చేసి ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. కానీ నేడు అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ప్రజలకు వెన్నుపోటు పొడిచిందని తెలిపారు. ఏటా జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి, మహిళకలు ఉచిత బస్సు ప్రయాణం, అడబిడ్డ నిధి వంటి పథకాలను నేటికీ అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులపై రెడ్‌బుక్ పేరుతో వేధిస్తూ అక్రమ కేసులు బనాయించడం తప్ప ప్రజలకు చేసింది శూన్యమన్నారు. బచ్చుల బంగారు బాబు, బచ్చుల మోహన్‌రావు, బాపిరెడ్డి, భవాని ప్రసాద్‌రెడ్డి, కృష్ణారెడ్డి, ధనుష్, నాగరాజు, మణికంఠ రెడ్డి, లోకేష్, వెంకట మణికంఠ, నాని, రియల్, ఈశ్వర్, రాకేష్, బ్రహ్మారెడ్డి, వెంకటేశ్వర్లు, చిన్ను పాల్గొన్నారు.

ఆడబిడ్డలకు అందని నిధులు



చిమ్మిరి బండలో బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ కార్యక్రమంలో నాయకులు

మార్టూరు: నెరవేర్చలేని హామీలతో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిందని.. కానీ ప్రతి నెలా ఆడబిడ్డ కు ఇస్తానన్న 1500 రూపాయల నిధి ఏమైందని వైఎస్సార్సీపీ నాయకులు ప్రశ్నించారు. మండలంలోని చిమ్మిరి బండ ఎస్సీ కాలనీలో శనివారం రాత్రి నిర్వహించిన బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంలో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో ప్రతి కుటుంబానికి ఏడాదికి లక్షల రూపాయలు అందాయని వాటితో ప్రజల కొనుగోలు శక్తి పెరిగిందని తెలిపారు. దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి, బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు నివాళులర్పించారు. మండల కన్వీనర్ జంపని వీరయ్య చౌదరి, కాలనీవాసులు దుడ్డు ప్రసన్న బాబు, గాదె శ్రీనివాసులు రెడ్డి, కట్టా జగన్ అంజయ్య, కట్టా ఆదిశేషు, అచ్చి ఆంజనేయులు పార్టీ జిల్లా, మండల నాయకులు ఉప్పలపాటి అనిల్ చౌదరి, గడ్డం మస్తాన్ వలి, అడకా గంగయ్య యాదవ్, మైలా చిన్న నాగేశ్వరరావు, తమ్ములూరి సురేష్ ద్రోణాదుల సర్పంచ్ వంకాయలపాటి భాగ్య రావు, మార్కండేయులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ సర్టిఫికెట్‌తో విద్య, ఉద్యోగావకాశాలు



ఎన్‌సీసీ సర్టిఫికెట్‌లు అందుకుంటున్న విద్యార్థులు

వేటపాలెం: ఎన్‌సీసీ సర్టిఫికెట్‌లు పొందిన విద్యార్థులకు ఉన్నత విద్యావకాశలతో పాటు ఉద్యోగావకాశాలు, రిజర్వేషన్ సౌలభ్యం ఉంటుందని ప్రధానోపాధ్యాయుడు జి. శ్రీనివాసరావు తెలిపారు. కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో ఎన్‌సీసీ శిక్షణ పొందిన విద్యార్థులకు ఎ. సర్టిఫికెట్‌లు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ ఎన్‌సీసీలో చేరడం వల్ల దేశభక్తి క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి యు. హనుమంతరావు, హవల్దార్ రమేష్, సీతాదేవి, నాగేంద్రరావు పాల్గొన్నారు.

రౌడీ షీటర్లకు వినూత్న కౌన్సెలింగ్



రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ శేషగిరిరావు, ఎస్సై జనార్దన్

వేటపాలెం: రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని, అలవాట్లకు భిన్నంగా వ్యవహరించాలని చీరాల రూరల్ సీఐ శేషగిరిరావు అన్నారు. శనివారం రూరల్ సీఐ శేషగిరిరావు, ఎస్సై జనార్దన్ రౌడీషీటర్లను సారస్వత నికేతనం గ్రంథాలయానికి పిలిపించి వినూత్న పద్ధతిలో వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. ముందుగా గ్రంథాలయం చరిత్ర, పురాతన గ్రంథాలు, గ్రంథాలయంలో వదిలి వెళ్లిన మహాత్మా గాంధీ చేతి కర్రను వారి చూపించి గ్రంథాలయ చరిత్ర వివరించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ ఈ గ్రంథాలయం వందేళ్ల చరిత్ర కలిగిందని పురాతన మైందని తెలిపారు. ఇక్కడ ఉన్న పుస్తకాలను ఉపయోగించుకొని యువకులు మంచి ఉద్యోగాలు సాధించుకొని ఉన్నత స్థితికి చేరారని తెలిపారు. మీరు రౌడీ షీటర్లుగా పేరు తెచ్చుకొని మీ జీవితాలు పాడు చేసుకున్నారు. మీ కుటుంబ సభ్యులు లేదా మీ కుమారుడు, కూతురికి ఇటువంటి గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలను ఉపయోగించుకొని మంచి ఉద్యోగాలు వచ్చేలా చూడాలని సూచించారు. ఇటువంటి చరిత్ర కలిగిన గ్రంథాలయం చూసి మీలో మార్పు తెచ్చుకుంటారని భావిస్తున్నట్లు తెలిపారు. మీ వల్ల మీకుటుంబ సభ్యులు తల దించుకోకుండా ఉండేలా మీ ప్రవర్తనలో మార్పు తెచ్చుకోవలన్నారు.

సైబర్ క్రైంతో అప్రత్తంగా మెలగాలి



కడవకుదురులో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఎస్ఐ రమేష్, శక్తి బృందం

చినగంజాం: విద్యార్థులు మత్తు పదార్థాలు, సైబర్ క్రైం పట్ల అప్రమత్తంగా మెలగాలని ఎస్ఐ శీలం రమేష్ అన్నారు. శనివారం మండలంలోని కడవకుదురు గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆయన చీరాల శక్తి టీం బృందంతో కలిసి విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలు, మద్యం జోలికి వెళ్లకుండా జీవితాన్ని కాపాడుకోవాలని, మత్తు పదార్థాలను సేవించి బంగారు భవిష్యత్‌ను పాడు చేసుకోవద్దని సూచించారు. అదే విధంగా సైబర్ క్రైంల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రాంలను సద్వినియోగం చేసుకోవాలే తప్ప దుర్వినియోగం చేసి ఇబ్బందులు పాలు కావద్దని సూచించారు. విద్యార్థులకు ప్లకార్డులు ద్వారా అవగాహన కలిగించారు. శక్తి యాప్ వినియోగించే విధానాన్ని తెలియజేశారు. శక్తి టీం ఎస్ఐ హరిబాబు, పాఠశాల హెచ్ఎం కుర్రా రామారావు, శక్తి టీం బృందం, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు విఫలం




దేవరపల్లిలో మాట్లాడుతున్న కన్వీనర్ అప్పారావు

పర్చూరు(చినగంజాం): కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేక పోయిందని వైఎస్సార్ సీపీ పర్చూరు మండల కన్వీనర్ కఠారి అప్పారావు అన్నారు. వైఎస్సార్ సీపీ పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ గాదె మధుసూదనరెడ్డి ఆదేశాల మేరకు శనివారం మండలంలోని దేవరపల్లి గ్రామంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. రీ కాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమాన్ని ఇంటింటికి వెళ్ళి కుటుంబ సభ్యులకు వివరించారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాకు ఏ విధంగా మోసం చేసిందో వారికి వివరిస్తూ అందుకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని తెలియజేసే క్యూఆర్ కోడ్‌ను అందజేశారు. కార్యక్రమంలో మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు, వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, ప్రజా ప్రతినిధులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలి

అద్దంకి రూరల్: ప్రమాదకరమైన విద్యుత్ స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని కోరుతూ ఈనెల 5 న చేపట్టిన నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకుడు తంగిరాల వెంకటేశ్వర్లు కోరారు. శనివారం స్థానిక బస్టాండ్ సెంటర్‌లో స్మార్ట్ మీటర్ల వల్ల కలిగే నష్టాలను ప్రజలు వివరించారు. సీఐటీయూ నాయకుడు ఆదాం, ఎస్కే కరీం, మస్తాన్, మీరావలి, వెంకట్రావు పాల్గొన్నారు.



రైతులకు వెన్నుదన్నుగా అన్నదాత సుఖీభవ



చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే

చీరాల: రైతులకు వెన్నుదన్నుగా అన్నదాత సుఖీభవ పథకం నిలుస్తుందని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అన్నదాత సుఖీభవ – పీఎం కిసాన్ పథకాన్ని శనివారం నియోజకవర్గంలోని పాపాయిపాలెంలో ఎమ్మెల్యే లాంఛనంగా ప్రారంభించారు. రైతులకు పంట పెట్టుబడి సాయంగా కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పీఎం కిసాన్ పథకం, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రతి ఏటా రూ.20వేలు ఆర్థిక సహాయాన్ని అందిస్తుందన్నారు. మొదటి విడతగా పీఎం కిసాన్ కింద రూ.2వేలు, అన్నదాత కింద రూ.5వేలు కలిపి రూ.7వేలు చొప్పున నియోజకవర్గంలోని 7368 మంది రైతులకు రూ.4.59 కోట్లు ఖాతాల్లో జమ చేస్తామన్నారు. ఏఎంసీ చైర్మన్ కౌతరపు జనార్దన్, ఆప్కో చైర్మన్ హేమలత, ఆర్డీఓ చంద్రశేఖర్ నాయుడు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మేదరమెట్ల (అద్దంకి రూరల్): మోటార్ బైక్‌పై వెళుతున్న వ్యక్తిని మినీ బస్సు ఢీ కొట్టడంతో అతను మృతి చెందాడు. ఈ ఘటన మేదరమెట్లలో శనివారం చోటుచేసుకుంది. ఎస్సై తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని అనమనమూరు గ్రామానికి చెందిన కవల సాంబశివరావు (45) మేదరమెట్లలోని ఎస్‌బీ కల్యాణ మండపం ఎదురుగా బైక్‌పై వెళుతుండగా గ్రానైట్ కంపెనీకి చెందిన మినీ బస్సు వేగంగా వచ్చి సాంబశివరావును ఢీకొట్టింది. దీంతో సాంబశివరావు అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అన్నదాత సుఖీభవ అమలు

అద్దంకి రూరల్: అన్నదాన సుఖీభవ పథకం నిధులు రైతుల ఖాతాల్లో జమ అవుతున్నాయని అద్దంకి మార్కెట్ యార్డు ఉపాధ్యక్షుడు ధర్మవరపు నాగేశ్వరరావు తెలిపారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అన్నదాత సుఖీభవ విడుదల సందర్భంగా సమావేశం నిర్వహించారు. ఏడీఏ ఎఫ్రాయిం, తహసీల్దార్ శ్రీచరణ్, వ్యవసాయాధికారి వెంకట కృష్ణ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా అంతరాయం

అద్దంకి రూరల్: అద్దంకి పట్టణంలో నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు, మున్సిపల్ కార్యాయంలోని వాటర్ ట్యాంకు కూల్చి వేత కారణంలో స్థానిక గీతామందిరం రోడ్, మున్సిపల్ ఆఫీస్ చుట్టు పక్కల, బంగ్లా రోడ్ చుట్టు పక్కల ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ యం. దామోదరం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

రైతు ఆనందంగా ఉండాలి

పర్చూరు(చినగంజాం): రైతు ఆనందంగా ఉంటేనే రాష్ట్రం సస్యశ్యామలంగా ఉంటుందని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. శనివారం వ్యవసాయ మార్కెట్‌లో అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడారు. ప్రతి రైతు కుటుంబానికి అన్నదాత సుఖీభవ కింకద ఏడాదికి రూ. 20 వేలు చొప్పున ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. పర్చూరు మార్కెట్ కమిటీ చైర్మన్ గుంజి వెంకటరావు, డ్వామా పీడీ విజయలక్ష్మి, ప్రత్యేక అధికారి లవన్న, ఏడీఏలు ప్రవీణ, రాజా తదితరులు పాల్గొన్నారు.

శింగరకొండ నూతన కమిటీ నియామకం

అద్దంకి రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శింగరకొండ పై వేంచేసి ఉన్న క్షేత్రపాలకుడు లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన నూతన కమిటీ సభ్యులను శనివారం నియమించారు. గుంజి శ్రీనివాసరావు, మంగమూరి సురేష్, దాసరి రామాంజనేయులు, రుద్రు ఆదిలక్ష్మి, కొడిమెళ కోటేశ్వరరమ్మ, సీహెచ్ వెంకటరమణ, కె. లక్ష్మీ ప్రసన్న, బత్తుల సరిత, బత్తుల ఆదిలక్ష్మి, భాగవతులు నరసింహాచార్యులున్నారు.